# గర్భగుడిలో గబ్బిలాలు

నవ్వులూరి వెంకటేశ్వరరావు

**ఆ ఊరు వెళ్లే ప్రయత్నం ఏ నాటి నుంచో చేస్తూండగా, ఒకే కార్యాలయంలో పని చేస్తున్న ఆ తొమ్మిది మందికి ఈనాటికి వీ లయింది. అక్కడ జలపాతం ఉంది. జలాశయం ఉంది. అవి బాగుంటాయి. కొండలూ, లోయలూ దిగ్భ్రమ కలిగిస్తాయి. వాళ్లు ఇష్ట పడే ముఖ్యాంశం వేరే ఉంది.**

"విశాఖపట్నం ఈనుతోంది అనుక్షణం. మనుషులకు మరో వ్యాపకం, ఖర్చు లేని వేరే వినోదం ఉన్నట్లు లేదు - 'కలవటం, కనటం తప్ప' ' అన్నాడు ప్రభాకరం, మనిషీ మనిషీ మధ్య అంగుళం చోటు లేకుండా కిటకిటలాడుతున్న ప్లాట్‌ఫాం మీది జనాన్ని బస్సు లోంచి చూస్తూ.

తొమ్మిది మందిలోకీ బంగారయ్య ఒక్కడే రావాల్సి ఉంది. కండక్టరును మంచి చేసుకుని బస్సును అప్పటికే అయిదు నిమిషాలు ఆపించారు.

"ఏ వడ్డీ లెక్క లేసుకుంటూనో, వసూళ్లు చేసుకుంటూనో ఊరి ప్రయాణం మాట మరిచి పోయి ఉంటాడు వెధవ!" అతని దగ్గర అప్పులు చేసే షణ్ముఖరావు అభిప్రాయ పడ్డాడు.

"పాపికి చిరాయు వన్నట్లు, మొత్తం మీద తగలడుతున్నాడు - చూడండి, చూడండి వాడి నడకా, వాడూ!" కృష్ణయ్య ఎగతాళిగా అన్నాడు.

పరిమితి మించి ఉన్న ప్రయాణికులలో ముగ్గురు శృంగవరపు కోట వెళ్లాల్సిన వాళ్లని గడ్డం పట్టుకుని బతిమిలాడి దించేసి, బంగారయ్యకు చోటు కల్పించగలిగాడు - చిదంబరం నుంచి కింగ్ సైజ్ ఫిల్టరు సిగరెట్ ఈనాంగా పొందిన కండక్టర్ సాబ్.

శృంగవరపు కోట దాటిన దగ్గర నుంచి ఘాట్ మొద లవుతుంది. అది అరకు చేరే దాకా ప్రయాణికులను బాలే చేయిస్తుంది. అరకు చేరే సరికి పది దాటింది. నాగరికత ఎయిడ్స్ సోకిన అరకు పూర్వ సహజ సౌందర్యాన్ని కోల్పోయింది. సమీపపు అనంత గిరి కొండల, బొర్రా గుహల పేర్లు చెప్పుకుని పెత్తనం చెలాయిస్తోంది.

విశాఖపట్నం నుంచి, సముద్ర మట్టానికి వందల అడుగుల ఎత్తుకి, కొండలు తొలిచి చేసిన సొరంగాల గుండా సాగే రైలు ప్రయాణం చేయదగినది. విశాఖ నుంచి మధ్య ప్రదేశ్‌లోని కిరండల్‌కి వేసిన ఈ రైలు లైనులోని సిమిలిగూడా భారత రైల్వేలలో చాలా ఎత్తు ఉన్న స్టేష నట. అరకు నుంచి మరో నాలుగు గంటల ప్రయాణం మాచ్‌ఖండ్‌కి.

అరకు దాటిన అరగంటకు వచ్చే పాడువా దగ్గర అంతర్రాష్ట్ర చెక్ పోస్ట్ చేరంగానే, బస్సు దిగి, అసలే అందమైన చెట్లల్లో మరీ అందమైన చెట్టుని ఎంపిక చేసుకుని దాని మొదట్లో లఘుశంక కానిచ్చి, "ఎక్కడా మందు?" అని ఒరియా గడ్డ మీద తెలుగులో అరిచాడు గోవిందు.

"నీ ఆత్రం కూలా! కేవలం దాని గురించే నటయ్యా మన రాష్ట్రం కాని ఈ రాష్ట్రానికి వచ్చింది?" తిరుమల రావు నీతి వాక్యం దొర్లించాడు.

'మన ఊళ్లో మన పెరటి గుమ్మం ముందు పాల పాకెట్టులా పెట్టి పోతారు కోరుకుంటే. కానీ దొంగ బతుకు లెందుకు? దొరల్లా, ఇంత మందిమీ అరుచు కుంటూ కరుచు కుంటూ, తాగి సామూహికానందం పొందటానికి అక్కడ ఆట్టే వీలు లేదు. సంసారపు రొంపికి దూరంగా, కొత్త ప్రదేశంలో ఆ పని చేయటంలో ఓ నావెల్టీ లేదూ?'

మూలుగుతూ, ముక్కుతూ, చీదుతూ, నురగలు గక్కుతూ, మెలికలు తిరుగుతూ, జారుతూ, నిలదొక్కుకుంటూ - మొత్తం మీద పొద్దున ఆరుకు బయలుదేరిన బస్సు రెండు గంటలకు జోలాపుట్‌ను, మాచ్‌ఖండ్‌ను దాటి ఒనక ఢిల్లీలో దించింది.

బస కన్నా అర కిలో మీటరు ముందే దిగిపోయారు, రేకుల షెడ్డు హోటల్ ముందు. దానికి పడమర వైపు రెండు మందు షాపులున్నాయి.


"రెండు దాటి పోయింది కదా, బల్లలు కడిగేస్తున్నారు. మనకు దుప్పి భోజనమే గతి!" అన్నాడు రంగారావు.

"దుప్పికి నోటికి అందినట్లు మనకు అందదు కదా!" - హనుమంతరావు.

"కొలిమికి వెళితే సరి!" కన్ను గీటాడు షరావు.

"తినబోతూ రుచి అడగనేల అన్నట్లు, వాళ్లను అడిగి తెలుసుకోబోతూ ఈ 'మీమాంస ఏల?" అన్నాడు తిరుమల రావు. చపాతీ, కూర చెయ్య గలం అన్నారు వాళ్లు. "మండే కడుపుకు ఎండు గడ్డి ఫలహారం చెయ్యండి" అన్నారు వీళ్లు. ఈ లోపల, నాలుగు సీసాలు బాగ్ పైపరు తీసుకుంటాం, ఎంత తగ్గిస్తావు అని బంగారయ్య బేరసారాలు సాగిస్తున్నాడు. సాయత్రం వచ్చి కొనుక్కు పోవచ్చుగా, పట్టపగలు అవి కొని పట్టుకు పోవటం ఎందుకూ మందుకు మొహం వాచినట్లు అన్నారు ఒకరు. "పోనీలే, బేర మాడి వదిలేస్తా. అయినా ఇక్కడ మూ డొంతులు తెలుగు వాళ్లే గదయ్యా! మనోళ్ల మధ్య మనకు సంకోచం ఏమిటి? తెలుగు గౌరవానికి భంగమా?"

అర గంటలో చపాతీలు, కూర సిద మయ్యాయి. వాళ్ల జీవితాల్లో మొదటిసారి లింటున్నట్లు ఆబాగా తిని త్రేన్చారు. సంచీలు తగిలించుకుని బసకు చేరారు. ఆ కాటేజీ ఫాల్స్




సీలింగు ఉన్న సిమెంటు రేకులది. ఒక గంట మాత్రం విశ్రాంతి తీసుకుని జనరేటర్స్ చూడటానికి వెళదాం అనుకున్నారు. మంచి నిద్రలోకి అప్పుడే జారిన అందర్నీ కసి కొద్దీ లేవ గొట్టేశాడు నిద్ర పట్టని తిరుమల.

ఈ కాటేజీ ఏర్పాటు చేసిన, అక్కడే పని చేస్తు న్నాయన వాన్ కూడా తెప్పించాడు వించ్ హౌస్ దాకా దిగబెట్టడానికి. పది నిముషాల్లో వించ్ హౌస్ చేరారు. వీళ్లతో పాటు ఒక కుర్ర ఇంజనీరు కూడా వించి ఎక్కాడు.

"మీరు జోలాపుట్‌లోనే దిగి ఉండాల్సింది. గంటన్నర ప్రయాణం. అక్కడ మా అతిథి గృహం ఉంది. సౌకర్యంగా ఉంటుంది. రిజర్వాయర్ అక్కడే ఉంది. కొండ మీది గెస్ట్‌హౌస్‌లో నుంచి జలాశయం అద్భుతంగా కనిపిస్తుంది" ఆ ఇంజనీర్ అన్నాడు.

'మీ అతిథి గృహంలో మాకు స్వేచ్ఛ ఉండదు. అందుకే ఒనకడిల్లీ ఎంచుకున్నాం. నిజానికి ఈ ప్రదేశమే ఎక్కువ చూడ దగిన దేమో కదా!'

ఇంజనీకు కుర్రాడైనా, వాళ్లకు ఎలాంటి స్వేచ్ఛ కావాలో అర్థం చేసుకోగలడు. తను అర్థం చేసుకున్నానని చెప్పటాని కన్నట్లు నవ్వి ఊరుకున్నాడు. తర్వాత, వాళ్లను తను గైడెడ్ టూర్‌కి తెచ్చినట్లు ఆ విషయం, ఈ విషయం చెప్పాడు.

వించ్ కొండ మీద నుంచి లోయలోకి దిగుతోంది. రమారమి కిలో మీటరున్నర దిగువకు

వెళ్లాలి, జనరేటింగ్ కేంద్రం చూడాలంటే. స్వాతంత్ర్యం రాకముందు ఆంగ్లేయుల సాంకేతిక నిపుణుల పుర్రెలకు పుట్టిన బిడ్డ ఈ జలవిద్యుత్ కేంద్రం. అంచనా వేసిన జీవిత కాలాలను మించి పని చేస్తున్నా యట జనరేటర్లు. విద్యుత్‌లో ఒరిస్సా రాష్ట్రానికీ భాగ ముంది. ఇప్పటికీ ఇంత అడవి ప్రాంతంగా ఉన్న ఈ ప్రదేశం యాభై సంవత్సరాల క్రితం ఎలా ఉండేదో ఊహించుకో మన్నాడు. అలాంటి రోజుల్లో, వందల టన్నుల భారీ సామగ్రిని, యంత్రాలను వించ్ మీద లోయలోకి చేర వేయటం ఒక గొప్ప ఇంజనీరింగ్ ఫీట్ అని ఆశ్చర్య పడ్డాడు.

నాగరిక ప్రపంచంలోనుంచి, తన ప్రాంతం నుంచి వచ్చిన ఈ మనుషులతో ఏదో సాన్నిహిత్యం తోచి ఉంటుంది. శబ్ద రాహిత్యంతో, ప్రశాంత వాతావరణంతో, ఒంటరితనంతో విసిగిపోయి ఉంటాడు.

వించి దిగుతోంది, రిజర్వాయరు నుంచి నీటిని తెచ్చే పైప్ లైన్ల పక్క నుంచి. వించ్ హౌస్ దూరమవుతోంది. కేబుల్ గట్టితనం మీద అందరి బతుకులూ ఆధార పడి ఉన్నాయి. కించిత్తు భయం, ఎక్కువ వింత కలిగిస్తోంది లోయలోకి జారిపోయే అనుభవం.

"నిర్విరామంగా జనరేటర్లు పనిచేసేట్లు చూడాలి మేము. లేకపోతే మీ దీపాలు ఆర్పేసిన వాళ్లం అవుతాం."

"మీ వాళ్లు ఈ వించ్‌ని మొదట కిందికి, తర్వాత పైకి చేంవేయ లేక పోయినా తొమ్మి దిళ్లలో దీపాలు ఆరి పోతాయి!" అన్నాడు హనుమంతు బిక్కుబిక్కుమంటూ.

"మరి మా ఇంటి మాటా? ఎంత స్వార్థం మాస్టారూ!"

"మీ విద్యుత్ కేంద్రాన్ని వదిలి మీ గురించి చెప్పండి."

"తండ్రి లేడు. పెళ్లి కావలసిన ఇద్దరు అక్క లున్నారు. ముసలి తల్లి ఉంది. ఇక్కడికి వాళ్లనీ తరలిస్తే వాళ్ల పెళ్లి సమస్య జటిల మవుతుంది. ఒంటరిగా గత సంవత్సరం నుంచి ఉంటున్నాను, ఈ కొండల మధ్య, లోయల లోతుల్లో చిక్కుకు పోయిన నేను అప్పు డప్పుడూ హోమ్ సిక్ అవుతా. నాగరికత పురోగతిని కంటితో చూసే అవకాశం లేక పోయింది కదా అనిపిస్తుంటుంది" అని కొంత సేపు ఊరుకున్నాడు. అపరిచితుల దగ్గర, ఒక్కరైనా తన వేవ్ లెంగ్త్ మీద ఉన్నారో లేదో తెలియకుండా అలా మాట్లాడటం వృథా అనే కాక, తన బలహీనతని వాళ్ల ముందు వెల్లడి చేసుకున్నా నన్న భావం కలిగి సి గ్గేసిందేమో.

టర్బైన్స్ వాడి వదిలేసిన నీరు ఏరులా పారుతోంది, శీలం పోయినా కనీసం చెర వదిలిం దన్నట్లు. కన్నీటి ధారను తలపింప చేస్తూ సన్నగిల్లి పోయింది డుడుమా. లోయలో నుంచి, కొండల మీద నుంచి హై టెన్షన్ టవర్లు రిలే రన్నర్సులా విద్యుత్తును తీసుకు పోతున్నాయి. ప్రకృతి భిన్నత్వంలో ఏకత్వాన్ని చాటే బాధ్యత వహించినట్లు టవర్స్‌ని ఒక దానితో మరొక దాన్ని కలుపుతున్న సరళ రేఖ ల్లాంటి పవర్ లైన్లు. అవి దూరానికి, ఆకాశాన్ని ముక్కలుగా అందంగా బ్లేడుతో కోసిన కోతల్లా కూడా ఉన్నాయి. వించ్ దింపేసిన తర్వాత ఇంజనీరు వాళ్లతో పాటు పైకి ప్రయాణం అవకుండా జనరేటర్స్ దగ్గరే ఉండిపోయాడు - దీపాలు ఆరకుండా చూడాలేమో కదా! తను వాళ్ల జ్ఞాపకాలలో నుంచి శాశ్వతంగా మరుగున పడిపోతాడు. ఇంట్లో దీపాలు ఆరినప్పుడు తిట్టడానికైనా గుర్తుకొస్తాడో, రాడో. వాళ్ల తొమ్మిది ఇళ్లలో దీపాలు ఆర్పకుండా వాళ్లని పైకి తెచ్చి పడేసింది వించ్. వాన్ లేదు. ఘాట్ రోడ్డు మీదుగా నడిచి ఊళ్లోకి అడుగుపెట్టాడు.

పడమటి చెట్ల కింద ఒక గట్టు మీద కొండ వాళ్లు కూర్చుని ఉన్నారు. వాళ్ల ముందు బుట్టలున్నాయి. వాటిల్లో జాడీ లున్నాయి. ఏదో అమ్ముతున్నారు. ప్రభాకరం, కృష్ణయ్య వాళ్ల వైపు నడిచారు. ఒక వృద్ధుడు, ఒక పదహారేళ్ల కుర్రాడు, మరో నలుగురు మధ్య వయస్కులలా కనిపిస్తున్న స్త్రీలు ఉన్నా రక్కడ.

వాళ్లను చూసి ఒక స్త్రీ లేచి నిలబడింది. ఆమెతో వాళ్లిద్దరూ మాట్లాడుతున్నారు. అయిదు నిముషాలు దొర్లి ఉంటాయి. ఆమెతో అయిదు నిముషాలు మాట్లాడడానికి ఏముందో. ఏ సమాచారం రాబడుతున్నారో, వాళ్ల జీవితాలకు అది ఏ విధంగా ఉపకరిస్తుందో. ఆమె జీవిత చరిత్ర తెలుసుకుంటున్నారా? "ఆ జీడి బ్రాండు వెధవల్ని పిలు!" అన్నాడు చిదంబరం బంగారయ్యతో.

"నీకు గొంతు లేదా? నువ్వే ఆ పని చెయ్యి! ఇప్పుడు వాళ్లు రాక పోతే ఆగి పోయే రాచ కార్యా లేమిటి?"


ఆమె జాడీలో నుంచి గ్లాసులోకి ఏదో ఒంపి ఇచ్చింది. వాసన చూసి, వేళ్లు ముంచి నాలుకకు రాసుకుని, లొట్టలు వేసి గ్లాసు తిరిగి ఇచ్చేశారు.

తిరిగి వచ్చి, "విప్ప సారా. మన బ్రాండు క్వార్టరు ఖరీదుకు ఒక జాడీ వస్తుంది!" కృష్ణ

"వద్దులే. అది తాగితే కోతులమై కొండల మీదికి పారి పోతా మేమో. ముఖ్యంగా అల్లావాడు అసలే హనుమంతు; అసలు తాగ కూడదు!" బంగారయ్య.

" 'మన'మందు తాగినప్పుడు వేరే విధంగా ప్రవర్తిస్తామా?" గోవిందం.

చల్లగా ఉంది. హాయిగా ఉంది. గంభీరంగానే కాక, పైకి కనిపించని ప్రేమగా కూడా ఉంది ప్రకృతి. ప్రకృతితో ప్రశాంతత అన్యోన్యంగా కాపురం చేస్తోంది. ఎంత ఉన్నతంగా ఉన్నాయి కొండలు? అంత ఉన్నతంగా ఉన్నా గడ్డిని మొలవనిస్తున్నాయి తమ మీద, జీవులని పాకనిస్తున్నాయి - మనిషిలా ప్రాణం, హృదయం, మస్తిష్కం లేకపోతే నేం? మనుషులు మరుగుజ్జుల్లా ఉన్నారు - ప్రాణం, హృదయం, మస్తిష్కం ఉంటే నేం? రాత్రి ఆరంభమైంది. ఆ క్షణాలకే ఎదురు చూడటం. రాత్రి మంచిది - పెద్ద మనసుతో గుట్లు రట్లు



కాకుండా కాపాడ ప్రయత్నిస్తుంటుంది.

కొండ వాళ్లు వెళ్లి పోతున్నారు బుట్టలతో. వాళ్లలో కృష్ణ ప్రభ మాట్లాడిన మనిషి ఉంది. వీధి దీపం కింద నుంచి వెళుతున్నప్పుడు ఆ పొడవు మనిషి పక్కకు చుట్టిన కొప్పులో నోరు తెరిచిన ఎర్ర మందారం, కొండ దేవత శిఖలో కుసుమంలా తోస్తుంది - చూడ గలిగిన కళ్లకు.

"ఇంతకూ, రాత్రికి ఏం వండమని తాజ్ రెసిడెన్సీ వాడికి చెప్పారు? కోడీ, గట్రా ఉందా?"

'ఎక్కువ మంది, రాత్రి పూట తమ ఉదరాలు కోడి బరువు మోయ లేవని చెప్పారు. పైగా, ఎనిమిది గంటల ప్రయాణం చేసి వచ్చాం కదా, వేడి చేస్తుంది. ఇక్కడ కృష్ణకు కాళ్లు పట్టే వాళ్లు లేరు. అందుకని శాకాహారం - బఠాణీ, తిరిగి గోధుమ రొట్టెలు, నాలుగు డజన్లు అరటిపళ్లు, మందులో నంచుకోటానికి కోడికి దీటైన పకోడి.'

విడిదికి వెళ్లి తిరిగి రావటం ఎందుకని తిరుమల, ప్రభ, కృష్ణ హోటల్‌కి వెళ్లి తిండి, పక్కన షాపులో విస్కీ సీసాలు పట్టించుకుని రావటానికి నిర్ణయమైంది. మిగతా ఆరుగురూ బసకేసి నడిచారు. వెళ్లబోతున్నప్పుడు ఎన్నో జాగ్రత్తలు చెప్పారు, సూచనలు చేశారు. బంగాళ దుంప కూరలో బఠాణీ ఎక్కువ వేయాలి. కూర ఘాటు నషాళానికి అంటాలి. చపాతీ దోరగా కాలాలి. పొరలు పొరలుగా, చర్మంలా విడాలి. పకోడీని ఉల్లీ పచ్చిమిరపల మందుతో దట్టించాలి. మందూ, పకోడీ మేడ్ ఫరీచదర్ కావాలి.

వాళ్లు విడిదికి చేరిన అర గంటకు తిండ్లు, సీసాలు చేరాయి. తిరుమలా, హోటల్ కుర్రాళ్లూ తెచ్చారు.

"వా ళ్లేరీ?" రంగా అడిగాడు.

"ఏదో పని ఉం దన్నారు."

"వాళ్ల గురించి లొట్ట లేసుకుంటూ అంత వరకూ ఎదురు చూడాలా?"

"మనల్ని కానిస్తుండమన్నారు."

"లొట్టలు వేయడమా?"

"ఈ పనినీ వాయిదా వేయ దగినంత ముఖ్యమైనదా ఆ పని?"

"పోనీ లెండి. మనకే మంచిది. ఒక పెగ్గు ఎక్కువ తాగొచ్చు."

కుర్రాళ్లని వెళ్లి పొమ్మన్నారు. రెండు విస్కీ సీసాలు తెరిచారు. ఆరున్నొక్క గ్లాసులు లెక్క బెట్టి మందు పోసి, బిస్లరీ సోడాలు దానిలోకి ఒంపి పల్చన చేశారు. పకోడీ పొట్లాలు విప్పి రెండు విస్తరాకుల్లో పోగుగా పోశారు. కుడి చేత్తో గ్లాసు అందుకుని, ఎడం చేత్తో గుప్పెడు పకోడీ తీసుకున్నాడు తిరుమల.

"నువ్వు వుర్ర చేత్తో ముట్టుకున్నది మేము తినాలా?" సీరియస్సయ్యాడు గోవిందు. వాగ్వివాదం అయింది. "ఎడమ కుడైతే పొరపాటు లేదోయ్! అయినా సీసా వాసన తగలంగానే కిక్కు కొడితే ఎలా?" అని సర్ది చెప్పి వాతావరణాన్ని తేలిక పరిచాడు హనూ.

"నాగరికత బిడ్డలం. సముద్ర మట్టానికి వేల అడుగుల ఎత్తుకు వచ్చి, అనాగరిక ప్రపంచానికి ఒక గౌరవం కలిగిస్తున్నాం. ఎ థౌజండ్ ఛియర్స్ టు సివిలైజేషన్!" అని టోస్ట్ చెప్పేడు చిదంబరం.

బయట విద్యు ద్దీపాల కు కాస్త ఎత్తు నుంచి చీకటి అలుముకుని ఉంది. దీపాల కాంతి ప్రకృతి గుట్టును రట్టు చేస్తున్నట్టుంది. కాస్తంత చలిగా ఉంది.

కాటేజీ నుంచి బయటకు పాకి చీకటిని కొంత మేరకు పార ద్రోలి, మరి ముందుకు పోయే శక్తి కొరవడి, వెలుతురు ఆగిపోగా, కొంత దూరం నుంచి తొంగి చూస్తోంది చీకటి. చీకట్లో నుంచి కుక్క మొరుగుతోంది.

పది నిముషాలు భరించి, మొరుగుడు తాలూకు శాల్తీని చూడటానికి గుమ్మం దాకా వచ్చాడు బంగారయ్య. చేతిలో ఉన్న సీసాను కుక్క మీదకి విసిరేయ లేక (మరి కొంత సేపు పోతే బంగారు కణిక ఉన్నా ఆ పని చేస్తాడేమో) అసందిగ్ధంగా నిలబడ్డాడు. బయటికి వచ్చి రాయి వెతికి దాన్ని కొట్టడానికి కుక్క భయం, చీకటి భయం. అసహాయత పుట్టించిన చికాకును నోటి నుంచి గాలిలోకి వదిలిన బూతు ద్వారా తీర్చుకుని, లోపలికి నాలుగు అడుగులు వేసి అటు తిరిగాడు.

బంగారయ్య పిరికితనం చూసి షరావు పెద్దపెట్టున నవ్వాడు. కుక్క మొరుగుడు కన్నా బిగ్గరగా. కుక్కలు కర్రల్ని, రాళ్లని లెక్క చేస్తాయి గానీ, బూతుల్ని లెక్క చెయ్యవు. వాటికి మనిషి భాషన్నా అర్థం కాకపోవాలి, అర్థమయ్యా, సున్నితత్వమన్నా కొరవడి ఉండాలి.

షరావు అన్నాడు - "దానికి రాయి భాషే కానీ, మనిషి భాష తెలియదు బంగారయ్యూరూ!"

అతని తిరిగి నవ్వాడు. ఆ నవ్వు భయం కలిగించినట్లుంది - కుక్క క్షణం ఆగి, ఆ క్షణంలోనే ఏదో ఆలోచించి, ఆ నవ్వుకు భయపడాల్సిన అగత్యం లేదన్న నిర్ణయానికి అతి త్వరగా వచ్చి, తిరిగి గొంతు చించుకుంటోంది.

"ఏడుగురు తాగాల్సిన సీసా నీ బాబుగారి సొత్తులా పట్టుకు తిరిగితే, మేం ఏం తాగాలి? (బూతు) ...డా?" అడిగాడు చిదంబరం.

"అబ్బాయి చిదంబరం! ఈ టవలు చుట్టుకో వా మీద కనికరించి. ఆ కడ్రాయరు మినహాయింపుతో నీవు నీ బర్త్‌డే సూట్‌లో మాకు ఇస్తున్న విశ్వరూప దర్శనాన్ని చూడగల శక్తి ఈ చర్మ చక్షువులకు లేదు."

"నీలి చిత్రాలు మరిగి కొండల్లోనూ, లోయల్లోనూ బూతే కనిపించే నీ నయనాలకు ఇట్లాంటి విశ్వ రూపాలు ఆనకూడదే?"

"ఇక్కడా విద్యుత్తుకు కొర తేమిటి? ఇది దానికి పుట్టిల్లు. మరి వీథులు చీకటిగా ఉన్నాయి' 'హనూ అన్నాడు. చీకటన్నా, కుక్కలన్నా, పురుగూ పుట్రా అన్నా బాత్రూం కెళ్లే పని పడుతుంది అతనికి.

"మీ పేరు మీరు తలుచుకోండి!" అన్నాడు బంగారయ్య. సగం గ్లాసు అత్రంగా, హాలాహలంలా ఒక్క గుటకలో మింగి, ఆ మాటలను విషంలాగే కక్కాడు.

జారి పోతున్న లుంగీ పైకి లాక్కుంటూ,

## జోక్

### మీ రొక్కరే

ఆపరేషన్ బెడ్‌మీద పేషెంటు కళ్లు తెరవగానే డాక్టరు స్పృహతప్పి పడిపోయాడు. ఆయన కేమయిందని అడిగాడు పేషెంటు.

'ఏంలేదు...ఆపరేషన్ చేసిన 15 మందిలో తిరిగి కళ్లు తెరిచింది మీ రొక్కరే...అందుకే డాక్టరుగారికి కళ్లు తిరిగాయి' అంది నర్సు.

పి. రాధిక, హంపసాగర

"లక్ష్మికి పుట్టిన బిడ్డలు. ఒకరి కొకరు సోదరులే. సఖ్యంగా ఉండా లండీ!" షరావు.

ఇంటి ముందు ఖాళీ స్థలం ఉంది. ఇంతకు ముందు నివసించి ఇల్లు ఖాళీ చేసి వెళ్లిపోయిన వాళ్ల గుర్తుగా డిసెంబరు పూల చెట్లు, గులాబీ పొద ఉన్నాయి. ఆ పొద ఒక చారెడంత పూవు అమాయకంగా, అవసరమా, అనవసరమా అని ఆలోచించకుండా పూసింది. పొలమారిన షరావు బయటికొచ్చి ఊశాడు. మందూ, లాలాజలాల మిశ్రమంలో గులాబీ తడిసింది.

"ఈ రాత్రి ఆ కుక్క అలాగే అరుస్తుంటే మనకు శాంతి ఉండదు!" ఖాళీ గ్లాసులోకి సగానికి సోడా ఒంపుకుని రంగా దగ్గరకొస్తూ బంగారయ్య అన్నాడు. రంగా తన దగ్గరి సీసాలో నుంచి అతని గ్లాసులోకి ఒంపాడు పకోడీ నములుతూ.

రంగా తెగించి వెలుపలికి వెళ్లి ఒక రాయి తీసుకుని కుక్కను కొట్టాడు. వాతావరణంలో ఏ మాత్రం తేడా ఉన్నా అది పూర్తిగా చల్లారి పోయి చలి వుంజుకుంటోంది. దూరంగా ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ గుయ్‌మంటోంది కూనిరాగంలా. ఎల్లెడలా నిశ్శబ్దం. ఆ కొండలలో, లోయలలో నిశ్శబ్దం కూడా ప్రతిధ్వనిస్తున్నట్టుంది. ఆకాశానికి ఎగిసిన కొండలు. కుక్క మొరుగుడు తిరిగి ఆరంభం.

"కుక్క మొరుగుడూ లేకపోతే ఈ నిశ్శబ్ద వాతావరణం చంపుతుంది. అరవనీ!" అన్నాడు తిరుమల రంగాతో.

"దాన్ని అరవనీయకుండా నోరేం మూసెయ్య లేదు. బంగారయ్య సంగతి అటుంచు. నా ఇబ్బందులు నాకూ ఉన్నాయి" అంటూ రెండు వేళ్లు చూపించాడు రంగా.

"నీ ఇబ్బంది అదా! అది అరిచే కుక్క; కరవదులే!" తిరుమల అభయ మిచ్చాడు రంగాకు.

"అది నీ స్నేహితుడో, బంధువో అన్నట్లు, దాని సంగతి క్షుణ్ణంగా తెలిసినట్టూ బాగా సెల విచ్చావు!" అన్నాడు రంగా ఇబ్బందిగా మొహం పెట్టి.

"నేను రైతు బిడ్డను. అ బిడ్డ కుండే అలవాట్లు ఒకటి రెండు పోలేదు నాకు. ఇంట్లో వెళ్తే వెళ్లి నట్టుండదు" అంటాడు రంగా.

పెరటి తలుపు తీసుకుని పొదల్లోకి పోయాడు రైతు బిడ్డ.

కృష్ణపక్షపు వెన్నెల, కొండల మీదికి ఎవరో వల విసిరినట్లు పడుతోంది.

"పున్నమి నాడు వచ్చి ఉండే డుడుమా జలపాతాన్ని వెన్నెట్లో చూసి ఆనందించి ఉండే వాళ్లం!" విచారాన్ని నటించాడు తిరుమల.

"ఆహా! ఇంటి పనిమనిషి అప్పలమ్మనే గాక ప్రకృతినీ ప్రేమిస్తున్నాడండీ తిరుమల!"

"ప్రభా, కృష్ణా ఏరీ ఏరీ?" నాటకీయంగా అన్నాడు రంగా, పెరటి తలుపు మూసి వస్తూ.

"ఇంత సేపా? ఎక్కడికి వెళ్లినట్లు? నిముషాలు దొర్లే కొలదీ ఉత్కంఠ భరించటం కష్టంగా ఉంది. వాళ్లేమై పోతారో అన్న బెంగ అక్కర లేదు. ఈ టోకియో మహా నగరంలో తప్పిపోయే ప్రమాదం లేదు. పులులు తిరిగే కోనా కాదు. మదిరను కూడా వదిలి వెళ్లిన ఆ పని ఏ కొంప మునిగేదో!' వాళ్లు తనకు దక్కని అనుభవాన్ని దేన్ని చవి చూస్తున్నారో అన్న బాధ తొలిచేస్తుండగా వాపోయ్యాడు బంగారయ్య.

రెండు సీసాలు ఖాళీ అవబోతున్నా వాళ్లు రాలేదు.

"వీళ్లకు బుద్ధి లేదు!" తిరుమల అరిచాడు.

"తిరుమలకు సత్య దర్శనం అయిందండీ ఇప్పటికి. బుద్ధి లేదు కాబట్టే మందు మీ పాలు చేసి బయట తిరుగుతున్నాం!" అన్నాడు కృష్ణ - పిల్లిలా పొంచి ఉండి వాళ్ల మాటలు విని, లోపలికి అడుగు పెడుతూ.

"ఇంతకూ ఏ ఘన కార్యం మీద నాయనా తిరగటం?" గోవిందు మత్తుగా నవ్వుతూ అన్నాడు. మామూలుగా చిరుబురులాడే గోవిందు, మం దుచ్చుకుంటే మహాత్మా గోవింద్ అవుతాడు.

"అది వ్యక్తిగత రహస్యం!"

"ఇక్కడ సామూహిక రహస్యాలూ, సామూహిక కార్యక్రమాలూ ఉండాలే గానీ వ్యక్తిగతాలు ఉండ రాదు!"

"మా ఇద్దరి వంతు ఒక సీసా ఇవ్వండి. మూడొంతులు మేము తాగే వరకు మీరు మరొక సీసా విప్ప కూడదు" ప్రభా.

"మిమ్మల్ని గాడిదలు కాయటానికి మేము వెళ్ల మన్నామా?" కోపంగా అరిచాడు తిరుమల. కొండల మధ్య నిశ్శబ్దం బద్ద లయింది.

"మీరు మందు కక్కుర్తి వెధవలని తెలిసీ వెళ్లటం మా ఇద్దరి పొరపాటు!"

తిరుమల లేచి నిలబడ్డాడు తూలుతూ. "నువ్వే వెధవ్వి!" అని కృష్ణ కాలరు పట్టుకున్నాడు. కృష్ణ అతన్ని ఒక్క తోపు తోశాడు. అతను గోడకు కొట్టుకుని కిందికి జారాడు.


కుక్క మొరుగుడు ఆరంభమైంది. వెనుక కాళ్లమీద కూర్చుని తల ఆకాశానికి ఎత్తి అరుస్తోంది వెన్నెట్లో. లోపలి గోల వరండాను దాటి నిశ్శబ్దాన్ని, నిశీధిని వెక్కిరిస్తోంది. అర గంటకు అంతా సర్దుకుంది. తిరిగి స్నేహితులయ్యారు. తిరుమలకు కొసరి కొసరి మందు పోస్తున్నాడు కృష్ణ. "పాపం, నువ్వు తాగింది తక్కువ భాయ్! ముందు నువ్వు పుచ్చుకో!" అంటున్నాడు తిరుమల మైకంలో.

కాటేజీ వెనుక తలుపు తీసి వెన్నెట్లోకి చూస్తున్నాడు ప్రభా. బంగారయ్యకు ఏదో అనుమానం వేసి, తనూ ప్రభా దగ్గరకు వెళ్లి అతని భుజం మీద నుంచి వెన్నెట్లోకి చూశాడు.

"మీరు ఒట్టి అనుమానం పక్షండీ!" ప్రభా.

"అంత ఆసక్తిగా పెరటి తలుపు తీసి చూస్తూ ఏమిటీ అని అడగటం తప్పుగా భావిస్తే ఎలా?"

(తరువాయి పేజీ 51)



(26వ పేజీ తరువాయి)

"నాకు మొదటి నుంచి ప్రతి దాంట్లో ఆసక్తి ఎక్కువ విద్యలో మినహా. ఆ పిచ్చి మొక్కలు, అందులో కదిలే క్రిమికీటకాలు, దూరపు కొండలు, వాటి మీద పడుతున్న వెన్నెల, ఆకాశంలో చుక్కలు, కరెంటు స్తంభాలు, దూరపు నక్కల అరుపులూ - అవన్నీ ఆసక్తి కలిగించేవే. అందుకని అటు చూస్తున్నా అంతే."

"నీవు ఎంత ప్రకృతి పరిశీలకుడివో మాకు మరో సీసా తాగిన తర్వాత చెప్పు."

ప్రభాకరం తలుపు మూసి కసిగా గడియ వేశాడు.

మిగతావాళ్లతో కృష్ణ అన్నాడు - "నేనూ, ప్రభాకరం లోపలి వరండాలో పడుకుంటాం. మిగతావాళ్లు మధ్య గదిలోకి, ముందు వరండాలోకి సర్దుకోండి. పడక గది ముక్క కంపు కొడుతోంది. బూజులు, ఎలుకలు, పందికొక్కులు తిరుగుతున్నట్లున్నాయి. అది ఖాళీగా వదిలేద్దాం. మన డబ్బూ దస్కం ఉన్నాయి కాబట్టి మధ్య గది, లోపలి వరండా మధ్య తలుపు వేసేసుకుందాం."

"అలాగే బ్రదర్! అలాగే కానీ, నీ మాట కాదనే నా ... ఎవరు?"

"అలా ఎందుకు? సగం మందిమి లోపల వరండాలో, సగం మందిమి మధ్య గదిలో సర్దుకుందాం. ముందు వరండాలో పడుకుంటే కుక్కల గోల; పోను పోను చలి కూడా!" చిదంబరం.

"తిరుమల గారు క్షమించాలి. ఆయనా, నీవు, బంగారయ్య, గోవిందు - మీరంతా గురకలు పెట్టే వాళ్లే. అవి ఎంత భయంకరంగా ఉంటాయో, ఒకరి గురక మరొక దానితో ఎలా పోలి ఉండదో మీకు ఇతరులు చెప్పక్కర లేదు. రైతు బిడ్డ రంగారావు గారికి కొత్త ప్రదేశానికి వస్తే రెండు మూడు సార్లు చెంబు పట్టుకుని వెళ్లి ప్రకృతి దేవి ఒడి చేరటం అలవాటని మనకు తెలియని రహస్యం కాదు. అతను లేచినప్పు డల్లా మాకు నిద్రాభంగం అవుతుంది. బయట వరండా తలుపు తీసుకుని, ఎవరూ లేవకుండా, మరో కంటికి తెలియకుండా - తెలిస్తే ఆయనకూ మొహమాటంగా ఉంటుంది. అతని పని అతను కానిస్తూండ వచ్చు. ఈ ప్రతిపాదనలో ఎలాంటి గుట్టు, మోసం లేవు, చిదంబరం!"

చిదంబరం, బంగారయ్య కన్విన్సు కాలేదు. ఒప్పుకుని, అసలు విషయం గుట్టుగా కనిపెట్టడం విజ్ఞతగా ఉం టుందన్న నిర్ణయాని కొచ్చి, మౌనం ద్వారా అంగీకారాన్ని తెలియ జేశారు.

గంట గడిచి ఉంటుంది. బయట నిద్ర లేని ప్రకృతి, కుక్క అరుపు, ఆ మనుషుల గోల లేని నిశ్శబ్దంలో కొండలు ధ్యాన ముద్రలో ఉన్నాయి. తపోభంగం చేయటానికి, టెమ్టింగ్‌గా కొండ మీది ఆకాశంలో తారకలు. జల విద్యుత్కేంద్రం పని చేస్తూనే ఉంటుంది, రొద చేస్తూనే ఉంటుంది - శక్తి ఉదయించటానికైనా పురిటి మూలుగులు తప్పవు. కుర్ర ఇంజనీరు, నాగరికతా దీపాల కాపలా దారుడిలా జనరేటర్ల దగ్గర ఉన్నాడో, తన బాధ్యతలు తీరి, తన ఊరు చేరి, నాగరికత పురోభివృద్ధిని ఎప్పుడు కంటితో చూస్తుండ గలనా అని కలలు కంటున్నాడో. జలాశయంలో శృంఖలాలు వేసిన జల రాశి వెన్నెలతో మొర పెట్టుకుంటుంది. బలహీన పడిపోయిన డుడుమా జలం బండల పాలై గలగలా జారిపోతుంటుంది. అనేక దారులు తొక్కుతూ, ఇంకి పోగా మిగిలినది గమ్యం వెతుక్కుంటూ సాగి పోతుంటుంది నిరంతరంగా - వెన్నెలైనా, చీకటైనా.

లోపలి వరండా పెరటి వైపు ద్వారం కిర్రుమంటూ తెరుచుకుంది. ఎవరో వ్యక్తి లోపలికి రావటం జరిగింది. వెలుపల, పెరటి పిచ్చి మొక్కల్లో మరో వ్యక్తి ఉండిపోయాడు. వాడితో ప్రభా మాట్లాడుతున్నాడు. లోపలికి వచ్చి వ్యక్తిని పడక గదిలోకి దారి తీయించాడు కృష్ణ. పెరటి తలుపు తిరిగి మూసుకుంది. ప్రభా తను ఇంతకు ముందు పడుకున్న చోట పడుకుండి పోయాడు. పడక గది తలుపులు మూస్తున్నాడు కృష్ణ. పాత చెక్క తలుపులు వంకర్లు పోయి ఉన్నాయి. కీళ్ల రోగపు మూలుగులు మూగాయి - ఇంకా ఎంత కాలం పడక గది రహస్యాలు కాపాడుతుండాలి అంటూ.

చిదంబరం, బంగారయ్య మినహా మిగతా వాళ్లంతా గురకలు తీస్తున్నారు. ఒకరి చేతులు

## పక్షులకు మాటలు నేర్పడమూ కళ!



స్వతహాగా కొన్నిపక్షులకు తాము వినే శబ్దాలను అనుకరించే శక్తి ఉంటుంది. ఒకటి రెండు పదాలు నేర్పి, ఆ పక్షి ఆ పదాలు ఉచ్చరించినప్పడల్లా దానికి ఆహార మిస్తారు. ఆవిధంగా క్రమక్రమంగా ఎక్కువ సంఖ్యలో పదాలు, వాక్యాలు నేర్పుతారు. తను ఆ మాటలు అనుకరించి మాట్లాడకపోతే తిండి దొరకదనే భయాన్ని కల్పిస్తారు. పక్షి వెంటవెంటనే ఆ భయంతో మాటలు నేర్చుకుంటుంది. క్రమంగా అది తన తెలివితేటలను ఉపయోగించి ఏ మాటలు ఎప్పుడు మాట్లాడాలో తెలుసుకుంటుంది. ఆకలి వేసినప్పుడు 'నాకు ఆకలిగా ఉంది' అంటే గాని ఆ పక్షికి తిండి దొరకని పరిస్థితి కల్పిస్తారు. దాన్ని ఎంతో ప్రేమగా చూస్తారు, ఒంటరిగా పంజరంలో ఉంచుతారు. మాటలు నేర్పే వ్యక్తి మినహా మరెవ్వరూ దాని కంట పడరు. ఆ ఒంటరితనం పోగొట్టుకోవడానికి ఆ పక్షి మాట్లాడే ప్రయత్నం చేస్తుంది. తమ పలుకులు తమను సాకే మనుషులకు ఆనందా న్నిస్తున్నాయని గ్రహించాక అవి సాధారణంగా అలాంటి ఆనందాన్ని పంచడానికి తరచు మాట్లాడుతుంటాయి.

శ్రీవాసవ్య

ఒకరి మీద, ఒకరి కాలు మరొకరి మీద ఉన్నాయి. ఒంటి మీద బట్టలు పేరుకే ఉన్నాయి. నిద్రలో అంతా జుగుప్స కలిగిస్తున్నారు. మనిషి నైజం నిద్రలో మరీ వెల్ల డవుతుంది. లోపల మనుషుల అలికిడి లేకపోవడంతో కుక్క మొరుగుడు వినబడటం లేదు. బయటి ప్రకృతి సౌందర్యం వెల్లివిరుస్తోంది.

బంగారయ్య చిదంబరాన్ని మోచేత్తో పొడిచాడునెమ్మదిగా.

"గమనించాను" అని బంగారయ్య చెవిలో అతను అన్నాడు.

"తలుపులు తోసుకుని లోపలికి వెళ్దామా?"

"కాపు కాచి పట్టుకున్నామని వాళ్ల గొడవ పెట్టుకోరా?"

"కలిసి ఒక జట్టుగా వచ్చిన తర్వాత ఈ రహస్యాలూ అరమరికలూ ఏమిటి?"

"మిగతా వాళ్లను లేపుదామా?"

"దాని వల్ల ప్రయోజనం? వాళ్లిద్దరి గుట్టు మనం తెలుసుకున్నామని చెప్పి, వాళ్ల పొందే సుఖంలో భాగం సాధించుకోవటం వివేకవంతుల లక్షణం."

"బంగారయ్యా! నీవు బంగారయ్యవే. నీ రెండవ వృత్తి నీ ఆలోచనా ధోరణిని ఎంత ప్రభావితం చేసింది!"

"పొగడ్తా, విమర్శా?"

"ఇలాంటి అద్భుతమైనది, నాకూ ఉపయోగ పడేదీ అయిన ఆలోచనను చెప్పే వ్యక్తిని విమర్శించే తెలివితక్కువ వాడిని, నీచుణ్ని కాదు."

"పది నిమిషా లాగుదాం. వాళ్లిద్దరి వేడీ ముందు చల్లారితే ప్రతిఘటన అంతగా ఉండదు."

ప్రభాకి బదులు కృష్ణ వరండాలో పడుకుని ఉన్నాడు. పావు గంట పోయిన తర్వాత నెమ్మదిగా తలుపులు తోసి లోపల వరండాలోకి వెళ్లారు చిదంబరం, బంగారయ్య.

చాప మీద లేచి కూర్చున్నాడు కృష్ణ కంగారుగా.

"మాకు అంతా తెలిసి పోయింది" చిదంబరం.

"గొప్పగా కనిపెట్టారు చిదంబర రహస్యం ... ఇంతకూ ఏమంటారు?"

"నీవు అనాలి ఏదో ఒహటి."

"వాడిని బయటికి రానీయండి, అప్పుడు తేల్చుకోవచ్చు!" అని అతను అంటూండగానే అలికిడి విని ప్రభా వెలుపలకి వచ్చాడు. అంతా ఆకళింపు చేసుకున్నాడు.

"సీలేరు వెళ్లినప్పుడు నీ భాగోతం చూశాం కదా! తలుపు మూసినంత సేపు పట్టదు తెరవవటానికి. ఈ తాపత్రయం ఎందుకు బంగారయ్యా నీకు?" కృష్ణ

"ఒప్పుకుంటుందా? పదండి అడుగుతాను" అని గదిలోకి దూరాడు ప్రభా. కొవ్వొత్తి వెలిగించి లోపలికి పట్టుకెళ్లాడు బంగారయ్య.

ఆమె నిలబడి ఉంది. పాడుబడిపోయిన బూజులు వేలాడే గర్భ గుడిలో గుడ్డి గబ్బిలాల మధ్య కొండ దేవతలా ఉంది. ప్రభ ఒరియాలో మాట్లాడుతున్నాడు. ఆమె ఏదో సమాధానం చెబుతోంది. బంగారయ్యకు అనుమానంగా ఉంది - తమకు రాని భాషో ఆమె కేదో చెప్పి వ్యవహారం చెడ గొడతాడని. ఆ ద్వయం ఎరుగని మాయలు లేవు. ఆమె ఒప్పుకోవటం లేదు అంటే ఏం చేసేట్టు? మందు రగిల్చిన వేడి, స్త్రీ వాసన రేపిన కోర్కె ఎట్లా చల్లారటం, తీరటం? ఆమెను బలవంత పెట్టి ఒప్పించటం అసాధ్యం.

తెరిచీ తెరవని ఉత్తరపు కిటికీ రెక్కలలో నుంచి వెన్నెలలో మునిగి తేలుతున్న ప్రకృతి చిత్రం. 'ఎ కౌన్ చిత్రకార్ హై, ఎ కౌన్ చిత్రకార్' అని ముఖేష్ చేత తన్మయత్వంతో పాడించేది. నిశ్శబ్దం సంగీతం వినిపిస్తుంది వినే చెవులకు. ఒక నిర్దిష్టమైన ఆకృతి లేని మహా శక్తి దర్శన మవుతోంది.

నీటిని మథించగా పుట్టే విద్యుత్తూ దాని అంశే.

ఆ గదిలో ఉన్న నలుగురూ ఆమె చెవుల దాకా వస్తారు. ఆమె దృఢకాయం ముందు అల్ప ప్రాణుల్లా ఉన్నారు. ఆమె ఎదురు తిరగటం జరిగితే, ఆ గది తలుపులు మూసి, పిడికిళ్లతో, మో చేతులతో, మోకాళ్లతో కుమ్మి నలుగురినీ మర్దించ గలదు. చెలియలి కట్ట దాట కూడదని తనకై తాను విధించుకున్న నిబంధనకు కట్టుబడి ఉండే మహాసముద్రం. కొప్పు విడి పోయి భుజాల మీదుగా, వీపు నంతా ఆక్రమించి, జలపాతంలా దుముకుతున్న నొక్కునొక్కుల జుత్తు. ఆమె జుత్తు రంగే చీకటైంది. కీకారణ్యంలో దట్టమైన ఆ జుత్తులోకి ముఖం జొనిపిన మనిషి ఊపి రందక చస్తాడు - కనికరించి తల విదిల్చి ఆమే తొలగించక పోతే. ఆ బలమైన వక్షోజాలు కిటికీ అవతలి ఉన్నతమైన కొండల్లా వెరపు కలిగిస్తున్నాయి. ఆమె పొత్తి కడుపు డుడుమా లోయ. ఎండిన బీళ్లు చిగురించటానికి దయతో చెలరేగే పెను తుపాను ఆమె. ఆమె మనిషి చెరచ లేని కన్య. ఆమెది పాపం అంటని శరీరం.

"ఒప్పుకుంది."

"ఎందుకు ముందు మొరాయించింది?"

"మధురవాణి అన్నట్లు వేశ్యకీ నీతి నియమం ఉంటాయి. అర్ధరాత్రి దాటింది. ఇల్లు చేరక్కర లేదా? చంటి పిల్లాడిని వదిలి వచ్చింది."

"వేరే డబ్బు లడిగిందా?"

"బంగారయ్యా! చచ్చిన తర్వాత వడ్డీలు తెచ్చిన కరెన్సీ నోట్లతో తగలడతావా?"

"ఇంత ఇమ్మని మేము కుదుర్చుకున్నప్పుడు అడగ లేదు. ఇప్పుడూ అడగటం లేదు. ఎంతో కొంత ఇవ్వక పోతే నీకు పుట్ట గతు లుండవు."

ఇస్తే మాత్రం ఉంటాయా?

ఆమె చిన్న కళ్లు చేప పిల్లల్లా మిలమిల లాడుతున్నాయి - ఇది మత్స్యఖండ్. ఆమె వేసుకున్న రవిక రెండు చోట్ల తడిసి ఉంది.

బంగారయ్యను, ఆమెను గదిలో వదిలి మిగతా ముగ్గురూ గది బయటికి నడిచారు.

"విప్ప సారా కంపు కొట్టదు కదా?" బంగారయ్య వెళ్లిపోతున్న వాళ్లతో అన్నాడు.

"ఏదు, చనుబాల వాసన వేస్తుంది!" కృష్ణ తలుపు మూసి బయటికి వెళ్తూ అన్నాడు.

కిటికీ అవతల, వెన్నెట్లో - రాత్రికీ, ప్రకృతికీ, ఈమెకూ కాపలాదారులా కుక్క మొరగటం పునః ప్రారంభించింది.

(ఇది కేవలం కల్పితం. ఫ్రెంచ్ మహా రచయిత జోలాకి అంకితం.)

